క్లుప్తంగా

గడ్డివాములు దగ్ధం



అయిజ: మున్సిపాలిటీ పరిధిలోని పర్దీపురంలో శుక్రవారం ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధమైన ఘటన చోటుచేసుకుంది. పర్దీపురం గ్రామానికి చెందిన కుర్వ గంగన్న పశుగ్రాసం కోసం మూడు గడ్డివాములను ఏర్పాటు చేసుకున్నాడు. మిట్ట మధ్యాహ్నం అకస్మాత్తుగా గడ్డివాముల నుంచి మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన గ్రామ ప్రజలు మంటలను ఆర్పేందుకు బిందెలతో నీటిని చల్లారు. అనంతరం అగ్నిమాపక వాహనం సంఘటనా స్థలం చేరుకొని మంటలను పూర్తిగా ఆర్పింది. ప్రమాదంలో గడ్డివాములు కాలిపోవడంతో సుమారు రూ.లక్ష ఆస్తినష్టం ఏర్పడినట్లు బాధితుడు వాపోయాడు. గడ్డి వాములపై ఉన్న విద్యుత్ తీగల వల్ల ప్రమాదం సంభవించిందని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రమాదానికి కారణం విద్యుత్ తీగలు కాదని విద్యుత్ ఏఈ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

మద్యం పట్టివేత

ఉండవెల్లి: పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలో మద్యం అక్రమంగా బైక్‌పై తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. పుల్లూరుకు చెందిన మహేష్ అనే వ్యక్తి బైక్‌పై 18 లీటర్ల మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మద్యం విలువ రూ.21800 ఉంటుందని అంచనా వేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రాజోళి: మండల కేంద్రం శివారులో పేకాట ఆడుతున్న వారిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. మండల కేంద్రం నుంచి ముండ్ల దిన్నె వాగు సమీపంలో ఉన్న బొగ్గుల కుంట దగ్గర శుక్రవారం కొందరు పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో పోలీసులు దాడులు చేశారు. వసంత్, షాలు, బోయకృష్ణ, తెలుగు గంగన్న, నాయకి రామకృష్ణలు పట్టుబడగా, మరో నలుగురు ఆనంద్, తెలుగు శేషన్న, మద్దిలేటి, ఎర్ర సలాం పరారయ్యారు. పట్టుబడిన వారి నుంచి రూ.8,500 నగదు స్వాధీనం చేసుకుని, పరారీలో ఉన్న వారిని గాలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సుబాబుల్ చెట్లు దగ్ధం

- రూ.8 లక్షల నష్టం

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని బుడమర్సులో ప్రమాదవశాత్తు సుబాబుల్ తోటకు నిప్పంటుకోగా.. రూ.8లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. బాధిత రైతులు బుడమర్సు గోవిందు, గిడ్డన్న, రంగన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుబాబుల్ చెట్లు తగలబడుతున్నాయని సమీపంలోని రైతులు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన పొలం వద్దకు చేరుకోగా.. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 8 ఎకరాల్లో సాగుచేసిన సుబాబుల్ చెట్లు కాలిపోవడంతో రూ.8 లక్షలు నష్టపోయామని రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. ప్రభుత్వపరంగా తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

డిగ్రీ విద్యార్థులకు వీడ్కోలు

శాంతినగర్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం డిగ్రీ విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.చంద్రమోహన్ విద్యార్థులకు ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో స్థిరపడే అవకాశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని అందరిని అలరించారు. కార్యక్రమంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

అయిజ: మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా శుక్రవారం 9వ వార్డులోని మాలపేటలో బోర్‌వెల్‌కు కొత్త మోటార్‌ను అమర్చారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఏర్పాటు చేస్తున్న తాగునీటి సరఫరా నీరు సరిపోకపోవడంతో గతంలో ఏర్పాటు చేసిన బోర్‌వెల్స్ మోటార్లకు మరమ్మతులు చేపట్టారు. కాలిపోయిన మోటార్ల స్థానంలో కొత్తమోటార్లను అమర్చే పనులు చేపట్టారు.

ఉపాధి పనులకు బ్రేక్.. ఆందోళనలో కూలీలు

ఉండవెల్లి: మండల కేంద్రంలో ఉపాధి హామీ పని బంద్ చేయడంతో కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో ఎక్కువ మంది ఉపాధి హామీ మీదనే ఆధారపడి పని చేస్తున్నారు. రెండు వారాలుగా ఉపాధి పనులు బంద్ పెట్టారు. దీనిపై అధికారులను ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయింది. టెక్నికల్ అసిస్టెంట్ రామచంద్రుడును వివరణ కోరగా, ఆర్డీఎస్ కాల్వలో కొంతపని ఉందని, వాటిని చేయడానికి ఆర్డీఎస్ అధికారులు ఆమోదించడం లేదని పేర్కొన్నారు. 400 మంది కూలీలు వచ్చే క్రమంలో రోజుకు రూ.300 కూలీ వస్తున్న తరుణంలో ఎందుకు బంద్ చేశారని అధికారులను అడిగినా ఫలితం లేని పరిస్థితి నెలకొంది. ఉపాధి పనులు తొరగా ప్రారంభించాలని కూలీలు కోరుతున్నారు.

కేంద్రాల్లో గన్నీబ్యాగుల కొరత

- సమస్యల వలయంలో కొనుగోలు కేంద్రాలు
- రెండు మండలాలకు మూడు కేంద్రాలు
- ఎకరానికి ఎనిమిదిన్నర క్వింటాళ్లకు పరిమితం
- డబ్బు కోసం నెలరోజులు రైతుల నిరీక్షణ
- మార్క్‌ఫెడ్ అధికారులు న్యాయం చేయాలని కోరుతున్న రైతులు



కొంకల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు(ఫైల్)

శాంతినగర్: రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు సమస్యలకు నిలయంగా మారాయి. మార్కెట్‌ధర కంటే ఎక్కువకు కొనుగోలు చేస్తామని చెప్పడంతో సంతోషించిన రైతులు సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడం, గన్నీ బ్యాగుల కొరత కారణంగా కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఎకరానికి ఎనిమిదిన్నర క్వింటాళ్లకంటే ఎక్కువ కొనుగోలు చేయబోమని మార్క్‌ఫెడ్ అధికారులు చెప్పడంతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని విధాలా ధాన్యం సమకూర్చినా డబ్బులు చేతికి అందేవరకు నెలరోజులు పడుతోందని, ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పుగా తెచ్చుకున్న డబ్బు చెల్లించాల్సి ఉంటుందని, తొందరగా డబ్బు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

3500 ఎకరాల్లో జొన్నసాగు..

ఈ ఏడాది యాసంగి సీజన్‌లో రాజోళి మండలంలోని ఆయా గ్రామాల్లో 2700 ఎకరాల్లో రైతులు జొన్న పంట సాగుచేశారు. వడ్డేపల్లి మండలంలో 700 ఎకరాల్లో జొన్న సాగుచేశారు. ఎకరానికి 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని రైతులు చెబుతున్నారు. దీంతో రెండు మండలాల్లో మొత్తం 3500 ఎకరాల్లో సాగుచేసిన జొన్న పంటలో సుమారు 80 వేల నుంచి 87,500 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు రైతులు చెబుతున్నారు.

మూడు కేంద్రాలతో ఇక్కట్లు..

వడ్డేపల్లి, రాజోళి మండలాలకు సంబంధించి కేవలం మూడు చోట్ల మాత్రమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. గతంలో ఆరు చోట్ల కొనుగోలు కేంద్రాలు ఉండేవి. రాజోళి మండలంలో రాజోళి, పచ్చర్ల, వడ్డేపల్లి మండలంలో కొంకలలో మాత్రమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఎకరానికి 25 క్వింటాళ్ల దిగుబడి..

ఈఏడాది నీటిపారుదల కింద సాగుచేసిన సీడు జొన్న పంట ఎకరానికి 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రభుత్వం కేవలం ఎకరానికి ఎనిమిదిన్నర క్వింటాళ్ల కొనుగోలు చేస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని అన్నదాతలు వాపోతున్నారు. మిగతా ధాన్యం ఎక్కడ అమ్ముకోవాలో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. మొత్తం ధాన్యం అంతా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

నెల రోజులకు డబ్బులు..

బహిరంగ మార్కెట్లో సీడు జొన్నలు క్వింటాల్ రూ.2200 నుంచి 2500 ఉండగా ప్రభుత్వం రూ.3180 కొనుగోలు చేస్తున్నారు. క్వింటాలుకు సుమారు రూ.680 అదనంగా ఆదాయం వస్తుందని కొనుగోలు కేంద్రాలకు రైతులు ఎగబడ్డారు. రైతుల డబ్బులు రావడానికి నెల రోజుల సమయం పడుతోంది. కేంద్రాల వద్ద మాత్రం సౌకర్యాలు లేక రైతుల పరిస్థితి అధ్వానంగా ఉంది.

10 రోజుల్లో డబ్బు చేతికి రావాలి



జొన్నలు పట్టించిన రైతులకు పది రోజుల్లో డబ్బు చేతికి వస్తే బాగుంటది. పంట పెట్టుబడికి అప్పు ఇచ్చిన వారికి, మందులు ఇచ్చిన వారికి, కూలీలకు డబ్బులు ఇవ్వాల్సి ఉంటుంది. తొందరగా అకౌంట్లలో వేస్తే రైతులం సంతోషిస్తాం.

– చిన్న ఖాజ, రైతు, కొంకల

గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలి



గన్నీ బ్యాగులు లేక రెండు రోజులపాటు కొంకలలో కొనుగోళ్లు నిలిచి పోయాయి. గన్నీ బ్యాగులు అయిపోకముందే తెప్పించి కొనుగోళ్లు నిరంతరంగా కొనసాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గోపాల్‌రెడ్డి, రైతు, కొంకల

రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం

వడ్డేపల్లి, రాజోళి మండలాల్లోని మూడు కొనుగోలు కేంద్రాల్లో వారం రోజుల్లో 10 వేల క్వింటాళ్ల జొన్న ధాన్యం కొనుగోలు చేశాం. ఇంకా సుమారు 20 వేల క్వింటాళ్లు కొనుగోలు చేయాల్సి ఉంది. గన్నీ బ్యాగులు అయిపోగానే తెప్పిస్తున్నాం. ఇరవై వేల గన్నీ బ్యాగులు వస్తున్నాయి. బ్యాగులు కొరతలేకుండా చూస్తాం. రైతుల డబ్బులు త్వరలో వారి అకౌంట్లలో పడేవిధంగా చర్యలు తీసుకుంటాం.

– నాగేష్, మార్క్‌ఫెడ్ డీఎం, జోగుళాంబ గద్వాల జిల్లా

కాంగ్రెస్‌ను ఆదరిస్తేనే దేశ భవిష్యత్



శాంతినగర్ రోడ్‌షోలో అభివాదం చేస్తున్న కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి డా.మల్లురవి

- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డా.మల్లు రవి

శాంతినగర్: కాంగ్రెస్‌పార్టీని ఆదరిస్తేనే దేశ భవిష్యత్ బాగుంటుందని, నిరుద్యోగులకు, ఉద్యోగాలు కల్పిస్తామని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డా.మల్లు రవి అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో శుక్రవారం రాత్రి కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదట ఎన్టీఆర్ చౌరస్తా నుంచి రోడ్ షో చేపట్టారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రధానమంత్రిగా రాహుల్‌గాంధీ అయితే నిరుద్యోగులకు 30 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఇప్పటికే ఐదు గ్యారంటీలు అమలు చేశామన్నారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం సంబంధించి రిజర్వాయర్ పూర్తిచేస్తామన్నారు. బీజేపీ మతతత్వ పార్టీ అని ఆరోపించారు. కాంగ్రెస్‌పార్టీని ఆదరించి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రసన్నకుమార్, దీపక్‌ప్రజ్ఞ, నాగేశ్వర్‌రెడ్డి, సీతారామిరెడ్డి, నాగశిరోమణి, నాగరాజు, రామకృష్ణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయిజ: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మల్లు రవి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈనెల 5న ఎర్రవల్లిలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పేదలపక్షం

రాజోళి: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి పేదల పక్షమే ఉందని, నాటి నుంచి నేటి వరకు పేదలకు అండగ నిలిచి వారిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్న పార్టీ కాంగ్రెస్సే అని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దస్తగిరి అన్నారు. మండల కేంద్రంలో కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మూగెన్న, ప్రకాష్ రెడ్డి, షాషావలి, రషీద్, హసన్, భాస్కర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



గట్టు: మండలంలోని బల్గెరలో నిర్వహిస్తున్న శ్రీ దిగంబరస్వామి జాతర సందర్భంగా శుక్రవారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి ఔత్సాహికులు బల్గెరకు తరలి వచ్చారు. బండలాగుడు పోటీలను జెడ్పీటీసీ బాసు శ్యామల ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, ఎంపీటీసీ రూపవతి, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు హనుమంతునాయుడు, మాజీ సర్పంచు నారాయణరెడ్డి, నాయకులు జంబురామన్‌గౌడు, అంగడి బస్వరాజు, యల్లందొడ్డి గోవిందు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఎన్నికల ప్రచారం



అయిజ: మండలంలోని సింధనూరు, కొత్తపల్లి, తొత్తినోనిదొడ్డి గ్రామాల్లో బీజేపీ నాయకుడు అలంపూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో మాట్లాడారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం స్థానానికి బీజేపీ నుంచి పోటీచేసిన భరత్ ప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి జలగరి అశోక్, జిల్లా ఉపాధ్యక్షురాలు రమా సాయిబాబ, జిల్లా కార్యదర్శి స్వప్న పాల్గొన్నారు.

పారదర్శక ఎన్నికల నిర్వహణే లక్ష్యం



కొర్విపాడులో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మానవపాడు: పారదర్శకత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కొర్విపాడులో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు. ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో కేంద్ర బలగాలు కీలకపాత్ర పోషిస్తాయని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సాయుధ బలగాలతో ఐటీబీపీ సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీబీపీ ఇన్‌స్పెక్టర్ కై లాస్‌రామ్, మండల పోలీస్ సిబ్బంది కేశవులు, హరిబాబు, నరేష్ పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు



అనుమతి లేకుండా తరలిస్తున్న ఎర్రమట్టి

కేటీదొడ్డి: కొందరు అక్రమార్కులు సహజ సంపదను కొల్లగొట్టి ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా తవ్వకాలు చేపట్టి లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. మండలంలోని గ్రామాల్లో మట్టి అక్రమ తరలింపు జోరుగా సాగుతోంది. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల అక్రమార్కులకు అడ్డుఅదుపులేకుండా పోతోంది. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. పాతపాలెం, గంగన్‌పల్లి, కొండాపురం గ్రామాల్లో ఎలాంటి అనుమతి లేకుండా ఎర్రమట్టిని తరలిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని గ్రామస్తులు ఆరోపించారు.

నిబంధనలు బేఖాతరు..

ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో మొరం, మట్టి తవ్వకాలు చేపట్టాలంటే మండల రెవెన్యూ, భూగర్భ గనుల అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఈ మేరకు వాల్టా చట్టం ప్రకారం ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించి తవ్వకాలు చేపట్టాలి. ఆ నిబంధనలను తుంగలో తొక్కుతూ అక్రమార్కులు గుట్టు చప్పుడు కాకుండా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఎరువులకు సబ్సిడీ ఇచ్చేది కేంద్ర ప్రభుత్వం



గద్వాలరూరల్: రైతులకు కిసాన్ సమ్మాన్ కింద పెట్టుబడి నిధులిచ్చి, ఎరువులకు సబ్సిడీ ఇస్తున్నది కేంద్ర ప్రభుత్వమే అని మాజీ ఎమ్మెల్సీ జనార్దన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీకే బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు ఏడాదికి 6 వేలు పెట్టుబడి సాయం, ఎరువుల కొనుగోలుకు 25 వేలు సబ్సిడీ నిధులిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి అశోక్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బండల వెంకట్రాములు, సీనియర్ నాయకులు రాజగోపాల్, రజక జయశ్రీ, ఉన్నారు.

ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదు

- ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి



బీచుపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా

ఎర్రవల్లిచౌరస్తా: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కష్టాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం బీచుపల్లి సాగర్ ఫంక్షన్ హాల్లో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్రంలో సరైన సాగునీరు, కరెంట్ లేక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో చెప్పిన ఆరు గ్యారంటీలు ఇప్పటి వరకు సక్రమంగా అమలు కాలేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో రైతులకు 24 గంటల ఉచిత కరెంట్‌తో పాటు చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసిందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ బలపర్చిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ స్నేహ, జెడ్పీటీసీ హనుమంతురెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రంగారెడ్డి, కిశోర్, కృష్ణసాగర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద పకడ్బందీగా తనిఖీ



చెక్‌పోస్టు వద్ద రికార్డు తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విజయ భాస్కర్‌రెడ్డి

కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికలకోడ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో వాహనాల తనిఖీ పకడ్బందీగా చేయాలని మహబూబ్‌నగర్ జిల్లా ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషర్ విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఆకస్మిక తనిఖీని పరిశీలించారు. ఈ సందర్భంగా పలు వాహనాలు, రికార్డులను క్షుణంగా తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో కర్ణాటక, గోవా నుంచి వచ్చే మద్యం, నగదు, బంగారం తీసుకెళ్లే వారు రశీదులు వెంట ఉంచుకోవాలని సూచించారు. ఎలాంటి ఆధారాలు లేని నగదు, బంగారాన్ని సీజ్ చేయాలని సూచించారు. చెక్‌పోస్టు వద్ద సీసీ కెమెరాను అమర్చాలని ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించిన బ్యానర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. వారి వెంట ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌గౌడు, గణపతి, పోలీసు సిబ్బంది బాలయ్య, సురేష్‌గౌడ్, రంజిత్, తదితరులు ఉన్నారు.

ఆయుష్మాన్ భారత్ లింక్ చేయాలి



మాట్లాడుతున్న ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంటెన్స్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజు

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంటెన్స్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.రాజు ఆధ్వర్యంలో ఏఎన్ఎంలకు రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలోని ఆశలు, ఏఎన్ఎంలు ఆయుష్మాన్ భారత్ కార్డులు లింక్ చేసి ఎన్సీడీ సూపర్‌వైజర్లకు తెలపాలన్నారు. ఏఎన్సీ ప్రోగ్రాం ఎప్పటికప్పుడు అప్డేట్ అయ్యేవిధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రిజ్వానా తాన్విర్, ఎన్సీడీ కోఆర్డినేటర్స్ శ్యాంసుందర్, మక్సూద్, పీహెచ్‌సీ సిబ్బంది చంద్రన్న, సంధ్యారాణి, హెలెన్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఎర్త్ వైర్లకు నీళ్లుపోయండి



వెంకటాపురంలో ఎర్త్‌వైర్‌కు నీళ్లు పోస్తున్న వ్యక్తి

అయిజ: ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ట్రాన్స్ ఫార్మర్ల వద్ద ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని, ప్రమాదాలు సంభవించకుండా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏర్పాటు చేసిన ఎర్త్ వైర్లకు తరుచూ నీళ్ల పోయాలని విద్యుత్ అధికారులు సిబ్బందిని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏర్పాటు చేసిన ఎర్త్ వైర్లకు నీళ్ల పోసే కార్యక్రమం కొన్నిరోజులుగా నిర్వహిస్తున్నారు. మండలంలోని వెంకటాపురం వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్లకు సిబ్బంది శుక్రవారం నీళ్ల పోశారు. ఎర్త్ వైర్లన్నింటికి తరుచూ నీళ్ల పోస్తుండాలని విద్యుత్ ఏఈ నరేందర్‌రెడ్డి సిబ్బందికి సూచించారు.

కబడ్డీ పోటీ విజేత ములమల్ల



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దాతలు, నిర్వాహకులు

అలంపూర్‌ రూరల్: మండలంలోని క్యాతూర్‌లో ఈదమ్మ జాతర సందర్భంగా నిర్వహించిన పురుషుల కబడ్డీ పోటీలు గురువారం రాత్రి ముగిశాయి. ఇందులో 30జట్లు పాల్గొనగా మొదటి బహుమతి ములమల్ల టీం గెలుచుకుంది. రెండో బహుమతి సి.కొత్తకోట, మూడో బహుమతి వడ్డేమాన్, నాలుగవ బహుమతి క్యాతూర్ జట్లు గెలుపొందాయి. గెలుపొందిన వారికి మోహన్‌రెడ్డి, గోవర్ధన్, బిచ్చారెడ్డి, ఇర్షాద్, శేఖర్‌రెడ్డి, తిప్పరెడ్డిలు బహుమతులు అందజేశారు. క్యాతూర్ మాజీ సర్పంచ్ పల్లి లలితమ్మ, నర్సింహులు అన్నదానం, మంచినీటిని కోనేరు భాస్కర్‌రెడ్డిలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు నరేందర్, అయ్యన్న, తిరుమలేష్, హరికృష్ణ, రవి, పరశురాం పాల్గొన్నారు.

డ్రెయినేజీ పూడ్చివేతపై వాగ్వాదం



బొంకూరులో డ్రెయినేజీని పూడ్చాక తొలగించిన కంకర



పంచాయతీ కార్యదర్శితో వాగ్వాదం చేస్తున్న కాలనీవాసులు

ఉండవెల్లి: మండలంలోని బొంకూరులో గత సర్పంచుల కాలంలో సీసీ రోడ్లను, డ్రెయినేజీ వ్యవస్థను నిర్మించారు. బొంకూరులో నెహ్రూపేట కాలనీలో డ్రెయినేజీని తొలగించాలని, దాన్ని వల్ల దుర్వాసన వస్తోందని కాలనీ వాసులు వారం రోజుల క్రితం పంచాయతీ కార్యదర్శికి, ఎంపీఓకు వినతి పత్రం అందజేశారు. దీంతో శుక్రవారం ఎంపీఓ పద్మావతి ఆదేశాల మేరకు బొంకూరు ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి రజీయా బేగం, పంచాయతీ కార్మికుల ఆధ్వర్యంలో డ్రెయినేజీని కంకరతో పూడ్చేశారు. కొంత మంది కాలనీ వాసులు డ్రెయినేజీ అలాగే ఉండాలని అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో పూడ్చిన డ్రెయినేజీలో కంకరను తొలగించారు. దీంతో కార్యదర్శితో పూడ్చాలని కాలనీ వాసులు వాగ్వాదం చేశారు. దీంతో గ్రామ పెద్దలు, కాలనీ వాసులు మాట్లాడి సర్దుకోవాలని ఎంపీఓ పేర్కొన్నట్లు కార్యదర్శి తెలిపారు.

వేరుశనగ క్వింటా రూ.6,963

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు శుక్రవారం 270 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ.6963, కనిష్టం రూ.3769, సరాసరి రూ.6386 ధరలు పలికాయి. అలాగే, 17 క్వింటాళ్ల ఆముదం రాగా గరిష్టం రూ.5413, కనిష్టం రూ. 1519, సరాసరి రూ.5212 ధరలు వచ్చాయి. అలాగే, 2652 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం రూ. 2368, కనిష్టం రూ. 1702, సరాసరి ధర రూ. 2100 ధరలు వచ్చాయి. 13 క్వింటాళ్ల వరి (హంస) రాగా గరిష్టం, కనిష్టం, సరాసరి ధర రూ. 1739 పలికింది. 4 క్వింటాళ్ల కంది రాగా, గరిష్టం రూ. 10266, కనిష్టం రూ. 8836, సరాసరి రూ. 10266 ధరలు వచ్చాయి.

బీచుపల్లిలో ప్రత్యేక పూజలు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సరస్వతి దేవికి అభిషేకం, కుంకుమార్చన చేశారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు ఉదయాన్నే బీచుపల్లికి చేరుకొని సరస్వతీదేవిని దర్శించుకున్నారు. అదేవిధంగా ఎర్రవల్లి చౌరస్తాలోని శివాంజనేయస్వామి ఆలయంలో కుంకుమార్చన వైభవంగా నిర్వహించగా.. మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.